www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

Galaxy S25 Ultra
Galaxy AI

శుక్రవారం | 28-3-2025 | పేజీలు: 6 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 86 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం,తిథి: చతుర్దశి రా.7.56 తదుపరి అమావాస్య, నక్షత్రం: పూర్వాభాద్ర రా.10.09 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: తె. ఉ. 7.45, అమృతఘడియలు: మ.2.57-4.23, దుర్ముహూర్తం: ఉ.8.41-9.30, మ.12.44-1.33, రాహుకాలం: ఉ. 10.30-12.00, సూర్యోదయం: 6.16, సూర్యాస్తమయం: 6.24 | శ్రీకాకుళం

Srikakulam | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అపరాల కొనుగోలుకు నమోదు

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో సాగు చేసిన అపరాల కొనుగోలుకు సంబంధించి నమోదు ప్రక్రియ ప్రారంభించామని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రభుత్వ ఆదేశాల మేరకు నాఫెడ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో అపరాలు కొనుగోలు చేస్తారు. క్వింటా మినుములు రూ.7400, క్వింటా పెసలు రూ.8682గా మద్దతు ధర నిర్ణయించాం. ఈ-క్రాప్, ఈ-కెవైసీ చేయించుకున్న రైతులు తమ పరిధిలోని రైతు సేవాకేంద్రాలలో పేర్లను నమోదు చేయించుకోవాలి. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పంటను విక్రయించాల'ని జేసీ సూచించారు.

ముగిసిన ఏపీపీఎస్సీ పరీక్షలు

శ్రీకాకుళం కలెక్టరేట్/ నరసన్నపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పబ్లిక్‌సర్వీస్ కమిషన్ గత మూడు రోజులుగా జిల్లాలో నిర్వహిస్తున్న పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ కేంద్రాన్ని ఆయన సందర్శించి.. పరీక్ష విధానాన్ని పరిశీలించారు. డిప్యూటీ డీఈవో పోస్టుల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పరీక్షలకు 92 శాతం మంది హాజరయ్యారని డీఆర్వో తెలిపారు. అయనతోపాటు నరసన్నపేట తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆ కాలనీవాసుల్లో ఆనందం

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

- 31వ డివిజన్ చెరువులో పిచ్చిమొక్కలు.. అసాంఘిక కార్యకలాపాలు
- ఏళ్లతరబడి పరిష్కారం కాని సమస్య
- కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఆంధ్రజ్యోతి, ఏబీఎన్
- రామ్మోహన్‌నాయుడు చొరవతో అభివృద్ధి పనులు
- కలుపు మొక్కలు తొలగించిన నగరపాలక అధికారులు, సిబ్బంది
- 'ఆంధ్రజ్యోతి'కి సాయినగర్ కాలనీవాసుల కృతజ్ఞతలు

శ్రీకాకుళం అర్బన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి.. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' ఆధ్వర్యంలో చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం వేదికగా మారింది. శ్రీకాకుళంలోని 31వ డివిజన్‌లో ఈ ఏడాది జనవరి 28న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ సమక్షంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమాన్ని 'ఆంధ్రజ్యోతి' నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సాయినగర్ కాలనీవాసులు ఏళ్ల తరబడి (మిగతా 2వ పేజీలో..)



సాయినగర్ కాలనీలో నాడు అధ్వానంగా ఉన్న చెరువు



నేడు శుభ్రంగా దర్శనమిస్తున్న చెరువు

● నగరాభివృద్ధే లక్ష్యం



శ్రీకాకుళం నగరం అభివృద్ధే లక్ష్యం. సామాజిక బాధ్యతతో ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి.. వాటి పరిష్కారానికి భాగస్వామ్యులైన 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక అభినందనలు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ చొరవతో సాయినగర్ కాలనీ చెరువు సుందరీకరణ పనులు చేపట్టాం. త్వరలోనే రోడ్డు, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ వేస్తాం.

-పీవీవీ ప్రసాదరావు, శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్

● 'ఆంధ్రజ్యోతి'కి రుణపడి ఉంటాం



25 ఏళ్లుగా కాలనీలో ఉంటున్నా. చెరువు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం ద్వారా కేంద్రమంత్రికి మా సమస్య విన్నవించాం. చెరువు సుందరీకరణ చేసి.. మళ్లీ అందుబాటులోకి తెచ్చినందుకు 'ఆంధ్రజ్యోతి'కి రుణపడి ఉంటాం. కేంద్రమంత్రికి, ఎమ్మెల్యేకు, కమిషనర్‌కు కృతజ్ఞతలు.

-బసవ శ్రీనివాసరావు, సాయినగర్ కాలనీ

● పాములతో హడలెత్తిపోయాం



చెరువులో కలుపుమొక్కలు పెరిగిపోవడంతో.. పెద్ద పెద్ద పాములు ఇళ్లలోకి వచ్చేసేవి. వాటిని చూసి హడలెత్తిపోయేవాళ్లం. 'ఆంధ్రజ్యోతి' చొరవతో సమస్యకు పరిష్కారం లభించడం ఆనందంగా ఉంది.

-పెద్దిరెడ్డి రమేష్, సాయినగర్ కాలనీ

● అసాంఘిక కార్యకలాపాలు తగ్గాయి



ఆరేళ్లుగా సాయినగర్ కాలనీలో నివసిస్తున్నాం. చెరువు చుట్టూ తుమ్మచెట్లు, పిచ్చిమొక్కలు మొలవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. చీకటి పడితే ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు భయపడేవాళ్లం. 'ఆంధ్రజ్యోతి' చొరవతో చెరువు ను శుభ్రం చేసి తుమ్మచెట్లు తొలగించడంతో అసాంఘిక శక్తుల పీడ విరగడైంది.

-పనుకు జయమ్మ, సాయినగర్ కాలనీ

● ప్రజాగళం.. 'ఆంధ్రజ్యోతి' నినాదం



సమస్యలు పరిష్కరించడంలో 'ఆంధ్రజ్యోతి'.. ప్రజాగళాన్ని విప్పి పోరాడుతోంది. జనవరిలో చెరువు సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు చెరువు సుందరీకరణ పనులు చేపట్టడంలో 'ఆంధ్రజ్యోతి' కీలకపాత్ర పోషించింది. చెరువు పనులు పూర్తి కావడానికి కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి అభినందనలు.

-విభూది సూరిబాబు, 31వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి

● అడవిని తలపించేది



కాలనీలో పదేళ్లుగా నివసిస్తున్నాం. చెరువు చుట్టూ విష జంతువులు, మొక్కలతో అడవిని తలపించేది. 'ఆంధ్రజ్యోతి' చొరవతో సమస్య పరిష్కారమైంది. ప్రస్తుతం ప్రతీ రోజూ పోలీసులు రాత్రి గస్తీ నిర్వహించడంతో.. గంజాయిబాబుల హడావుడి తగ్గింది.


-పుళ్ళట రవికుమార్, సాయినగర్ కాలనీ

పేటలో బెట్టింగ్‌లు

- ఆన్‌లైన్ గేమ్‌లో రూ.30లక్షలు పోగొట్టుకున్న బీటెక్ విద్యార్థి
- రోదిస్తున్న తల్లిదండ్రులు
- మాయల ఫకీరుల వలలో ఎందరో బాధితులు

> ● మూడేళ్ల కిందట నరసన్నపేటలో ఇందిరానగర్‌కు చెందిన ఇద్దరు వ్యాపారులు బెట్టింగ్‌లకు పాల్పడి.. సుమారు రూ.40లక్షలు చొప్పున పోగొట్టుకున్నారు. ఇందులో ఒక వ్యాపారి జమ్ము వద్ద విలువైన స్థలాన్ని అమ్మి కొంతమేర అప్పు తీర్చాడు.
>
> ● తాజాగా పెద్దపేటకు చెందిన ఒక వ్యాపారి కుమారుడు.. బీటెక్ విద్యార్థి ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్‌ల్లో సుమారు రూ.30లక్షలు పోగొట్టుకున్నాడు. ఇంకా డబ్బులు కావాలని.. లేదంటే చనిపోతానని బెదిరించడంతో ఆ తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. ఇలా ఎంతోమంది వ్యాపారులు, యువత ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు అలవాటు పడి ఆర్థికంగా నష్టపోతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ వ్యవహారం పోలీసుల దృష్టికి వెళ్లడంతో.. ఎస్పీ ఆరా తీస్తున్నారు.

నరసన్నపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ సీజన్ వేళ.. నరసన్నపేటలో జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. పదేళ్లుగా ఈ వ్యవహారంలో ఆరితేరిన ఫకీరులు.. ధనవంతులు, వ్యాపారుల బిడ్డలను టార్గెట్ చేస్తున్నారు. వారిని ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ ఊబిలోకి దించుతున్నారు. అలా వారి మాయమాటలు నమ్మి చాలా కుటుంబాలు రూ.లక్షల్లో డబ్బులు పోగొట్టుకుని రోడ్డున పడ్డాయి. నరసన్నపేట జూనియర్ కళాశాల మైదానంలో ఈ బెట్టింగ్ వ్యవహారం నడిపిన ఆ మాయల ఫకీరులు.. నేడు రాష్ట్రంలో పలు పట్టణాలకు తమ సామ్రాజ్యాన్ని విస్తరించారు. ప్రత్యేక బృందం ద్వారా యువతతో టచ్‌లో ఉంటూ ఆన్‌లైన్ లో కోట్లాది రూపాయల్లో బెట్టింగ్‌లు సాగిస్తున్నారు. క్రికెట్ సీజన్ లేని సమయంలో పేకాట డెన్‌లు నిర్వహిస్తారు. జిల్లాలో కాకుండా పేకాట ఆడేవారిని.. శని, ఆదివారాల్లో వాహనాల్లో బరంపురం, భువనేశ్వర్ తదితర ప్రాంతాలకు లేదా రిసార్ట్‌లకు తీసుకువెళ్లి.. అక్కడ పెద్దమొత్తాల్లో పందేలు నిర్వహించేవారు. ఇటీవల ఈ వ్యవహారం నిర్వహణకు డెన్‌లను జిల్లా సరిహద్దు (మిగతా 2వ పేజీలో..)



రిమ్స్‌లో వసూళ్ల పర్వం

జిల్లాకే పెద్దదిక్కుగా నిలిచిన శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో వసూళ్ల పర్వం నడుస్తోంది. ప్రత్యేకంగా ప్రసూతి విభాగంలో రోగుల జేబులను వైద్య సిబ్బంది ఖాళీ చేస్తున్నారు. మగబిడ్డ పుడితే రూ.1200, ఆడబిడ్డ జన్మిస్తే రూ.1000 చొప్పున వసూలు చేస్తున్నారు. రోగులను విశాఖ కేజీహెచ్‌కు అంబులెన్స్‌లో తీసుకెళ్లేందుకు రూ.2,600 తీసుకుంటున్నారు. పేరుకే పెద్దాసుపత్రి అయినా సేవలు మాత్రం ఆ స్థాయిలో అందడం లేదు. అడుగడుగునా సమస్యలు దర్శనమిస్తున్నాయి. ఒకపక్క సిబ్బంది కొరత, మరోపక్క వృథాగా పడిఉన్న పరికరాలతో రోగులకు అరకొరగా సేవలు అందుతున్నాయి. అత్యవసర మందులు కూడా దొరకడం లేదు. స్టెరిలైజేడ్ గ్లౌవ్స్ కూడా కొరతే. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ లేకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.



- మగబిడ్డ పుడితే రూ.1200, ఆడబిడ్డ జన్మిస్తే రూ.వెయ్యి ఇవ్వాల్సిందే
- సేవలు అంతంత మాత్రమే
- అత్యవసర మందులకూ ఇబ్బందులే
- అందుబాటులో లేని సూపర్ స్పెషాలిటీ వైద్యులు
- జూనియర్ డాక్టర్లే దిక్కు
- వేధిస్తున్న నర్సింగ్ సిబ్బంది కొరత

అరసవల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా, ఎంతమంది అధికారులు వస్తున్నా శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్)లో సేవలు మాత్రం మెరుగుపడడం లేదు. సంవత్సరాలుగా అవే సమస్యలు, వైద్య సేవల్లో అదే తీరు అంటూ రోగులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, నాయకులు ఎవరూ చెప్పినా పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. ప్రత్యేకంగా రిమ్స్ ప్రసూతి విభాగంలో వసూళ్ల దందా నడుస్తోందని రోగులు వాపోతున్నారు. గర్భిణులను లేబర్ రూమ్‌కి తీసుకువెళ్లాలన్నా, గాయాలు శుభ్రం చేయాలన్నా, కింది అంతస్తు నుంచి పై అంతస్తుకి తీసుకువెళ్లడానికి కూడా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. మగబిడ్డ పుడితే రూ.1200, ఆడబిడ్డయితే రూ.1000 చొప్పున మ్యాటీ అసిస్టెంట్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డ్రెస్సింగ్ చేసేందుకు రూ.300 చెల్లించాల్సి వస్తోందని రోగులు చెబుతున్నారు. హెడ్ నర్సులు వార్డుల్లో ఉండకుండా, రూమ్‌లో కూర్చుని కాలక్షేపం చేస్తుండడంతో ఈ వసూళ్ల నిరాటంకంగా సాగిపోతున్నాయనే విమర్శలు ఉన్నాయి. రాత్రి 8 గంటలు దాటిన తరువాత అత్యవసర సేవలందించేందుకు సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉండడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వీరు తమ రూముల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో పీజీలు, జూనియర్ వైద్యులే చికిత్సలు అందిస్తున్నారు. గుండె పోటు, రోడ్డు ప్రమాదాల్లో తలకు తీవ్రగాయాలైన కేసుల్లో స్పెషలిస్టు వైద్యులు సేవలు అందించాలి. కానీ, ఇటువంటి కేసులకు కూడా వారు హాజరుకావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆసుపత్రిలో 254 రెగ్యులర్ పోస్టులకుగాను కేవలం 124 మంది నర్సింగ్ సిబ్బందే పని చేస్తున్నారు. అలాగే కాంట్రాక్టు పద్ధతిలో కూడా నర్సింగ్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఎఫ్‌ఎన్‌వోలు కూడా కేవలం 23 మందే ఉన్నారు. దీంతో అంబులెన్సుల్లో ఆసుపత్రికి తీసుకువచ్చే రోగులను లోపలకు తీసుకువెళ్లేందుకు కూడా సిబ్బంది లేని దుస్థితి నెలకొంది. ఆసుపత్రికి సంబంధించి 120 మంది ఎంఎన్‌వోలు (మిగతా 2వ పేజీలో..)



ఇటు పరీక్షలు.. అటు ఈకేవైసీ కష్టాలు

- 31లోగా పూర్తి చేయాలంటున్న అధికారులు
- రేషన్ దుకాణాలకు క్యూ కడుతున్న ప్రజలు

అమ్మో.. ఓటీపీనా?

- ప్రభుత్వ సర్వేలకు ఇదే కీలకం
- చెప్పడానికి జనంలో సంకోచం
- ఉద్యోగులకు సహాయ నిరాకరణ

2లో

ఆహారం కలుషితమై..

- 22 మంది విద్యార్థినులకు అస్వస్థత
- హరిపురం సీహెచ్‌సీకి తరలింపు
- మందస కేజీబీవీలో ఘటన

హరిపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మందస వీజీపురంలోని కస్తూర్బా బాలికల విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం రాత్రి భోజనం చేసిన అనంతరం అర్ధరాత్రి సమయంలో కడుపునొప్పి, వికారంతో బాధపడ్డారు. వెంటనే సిబ్బంది స్పందించి వీజీపురం సచివాలయ ఏఎన్ఎంను తెప్పించి వైద్య సేవలు అందించారు. గురువారం ఉదయానికి మరికొంతమంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో మందస పీహెచ్‌సీ వైద్యులు మద్దిల సంపతిరావు పాఠశాలను సందర్శించి 22 మందికి వైద్యం అందించారు. వారిలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న 14 మందిని హరిపురం సీహెచ్‌సీకి తరలించారు. డి.శైలజ, వి.మౌనిక, ఎస్.ధార్మిత, పి.శంకుంతల, బి.జ్ఞానేశ్వరి, ఎస్.నవ్య, జి.జాహ్నవి, ఆర్.ఉజాల, డి.భవ్యశ్రీ, డి.లాస్య, కె.గోపిక తదితరులు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రికి డిప్యూటీ డీఎంహెచ్‌వో మారికలీజాన్ తన సిబ్బందితో సందర్శించి.. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థినులంతా క్షేమంగానే ఉన్నారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూపరింటెండెంట్ యు.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. అలాగే ఎంఈవో లక్ష్మణరావు, తహసీల్దార్ హైమావతి, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల ప్రత్యేకాధికారి ఆర్.వాసంతితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కాగా రాత్రివేళ బియ్యం సరిగా ఉడకకపోవడంతో విద్యార్థినులకు ఈ సమస్య వచ్చిందని అధికారులు అంచనా వేస్తున్నారు. పాఠశాలలో పర్యవేక్షణ లేక ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని కోరుతున్నారు.

● హరిపురం ఆస్పత్రిలో చికిత్స (మిగతా 2వ పేజీలో..)



విద్యార్థినులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ఈవీఎంల భద్రతకు పటిష్ఠ ఏర్పాట్లు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

3లో



ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

స్వచ్ఛ సిక్కోలు లక్ష్యంతో..

- 'వేస్ట్ టు ఆర్ట్' పేరుతో బొమ్మలకు రూపకల్పన
- పార్కులలో ప్రదర్శన
- నగర పాలక అధికారుల వినూత్న యత్నం

శ్రీకాకుళం అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సిక్కోలును సాధించేందుకు నగర పాలక సంస్థ అధికారులు విభిన్న రూపాల్లో అడుగులు వేస్తున్నారు. ప్రజల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించేందుకు వినూత్నమైన ప్రయత్నం చేస్తున్నారు. వ్యర్థాలతో వివిధ రకాల వస్తువులు తయారు చేసి వాటిని జన సంచారం ఉన్న ప్రాంతాల్లో ప్రదర్శిస్తున్నారు. వారిలో స్వచ్ఛతతో పాటు చెత్త నుంచి ఆర్ట్ తయారీపై ఆసక్తి కలిగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు నగర పాలక హెల్త్ ఆఫీసర్ ఆధ్వర్యంలో రోడ్లపై పడి ఉన్న వాటర్ బాటిల్స్‌ను సేకరించి.. వాటితో గొడుగులు, వివిధ రకాల బొమ్మలు తయారు చేయించారు. పాలకొండ రోడ్డులో ఉన్న సంజీవయ్య పార్క్‌లో గొడుగు, న్యూకాలనీలోని డైమండ్ పార్క్‌లో సీతాకోక చిలుక, అబ్దుల్ కలాం పార్క్‌లో డస్ట్‌బిన్‌లు, చేపల బొమ్మలు, ఎల్‌బీఎస్ కాలనీలో డస్ట్ బిన్లు, బొమ్మలు ఏర్పాటు చేశారు. వ్యర్థాలతో తయారు చేసిన ఈ వస్తువులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ డా.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ వేస్ట్ టు ఆర్ట్ అనే కార్యక్రమంలో భాగంగా వ్యర్థాలతో బొమ్మలు తయారు చేసి ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించేందుకే ఈ వినూత్నమైన కార్యక్రమం చేపట్టామని తెలిపారు.


సంజీవయ్య పార్క్‌లో వ్యర్థాలతో తయారు చేసిన గొడుగు


డైమండ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన సీతాకోక చిలుక బొమ్మ


ఎల్‌బీఎస్ కాలనీలో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లు


లక్ష్మీనారాయణ ఇంట్లో గోడలకు ఉన్న దేశ నాయకుల ఫొటోలు

అవి స్ఫూర్తి చిత్రాలు

- ఆ ఇంటి నిండా దేశభక్తుల ఫొటోలే
- లక్ష్మీనారాయణ ప్రయత్నానికి ప్రశంసలు


బత్తిని లక్ష్మీనారాయణ

వజ్రపుకొత్తూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా మన ఇళ్లలో గోడలకు మన ఫొటోలనో... లేకపోతే మన పెద్దల ఫొటోలనో వేలాడదీస్తుంటాం. అనేక ఇళ్లలో దేవతల ఫొటోలు కనిపించడమూ మనకు తెలిసిందే. దీనికి భిన్నంగా ఆ వ్యక్తి ఇంట్లో దేశ నాయకుల ఫొటోలు మనకు కనిపిస్తాయి. ఆయనే బాతుపురం పంచాయితీ పెదవంక గ్రామానికి చెందిన బత్తిన లక్ష్మీనారాయణ. ఆయనకు దేశభక్తి మెండు. చిన్నప్పటి నుంచి జాతీయ నాయకులన్నా... స్వాతంత్ర సమరయోధులంటే భక్తిభావం. దీంతో తన ఇంట్లో ఎక్కడ చూసినా జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలే కనిపిస్తాయి. పంచాయతీ పరిధిలో జాతీయ నాయకుల జయంతులు, వర్ధంతులు ఏవైనా లక్ష్మీనారాయణ ఇంటికి రావలసిందే. ఆ ఇంట్లో 40 మంది నాయకులు ఫొటోలు గోడలకు తగిలించి ఉంటాయి. ఇవన్నీ ఓపికగా ఆయన సేకరించారు. చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదవడం అలవాటని... వీటిలో నాయకుల జీవిత చరిత్రలు ఎక్కువగా ఉండేవని ఆయన చెబుతున్నారు. అలాంటి నాయకులను నేరుగా చూడలేకపోయినా కనీసం ఫొటోలు చూసి స్ఫూర్తి పొందు తున్నట్లు చెబుతున్నారు. వీటిలో చిత్రకారులు గీసినవి కాకుండా... నిజమైన ఫొటోలే అధికంగా ఉంటాయి. నెహ్రూ, స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, లాలా లజపతిరాయ్, బాలగంగాధర తిలక్, సర్వేపల్లిరాధాకృష్ణన్, వల్లభ్‌భాయిపటేల్, భగత్‌సింగ్, టంగుటూరు ప్రకాశం పంతులు, ఝాన్సీలక్ష్మీబాయి, మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి, కిరణ్‌బేడీ లాంటి నాయకులు, ప్రముఖల ఫొటోలు అధికంగా ఉన్నాయి. ఆ ఇంటికి వచ్చేవారు వీటిని ఆసక్తిగా తిలకిస్తుంటారు.


భరతమాత చిత్రపటంలో నాయకుల ఫొటోలు

ఇటు పరీక్షలు.. అటు ఈకేవైసీ కష్టాలు

రేషన్ కార్డు లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలని అటు అధికారుల నుంచి ఒత్తిళ్లు... ఇటు యంత్రాలతో సమస్యలు... అటు పిల్లలకు పరీక్షల సీజన్ కావడంతో స్వగ్రామాలకు రాలేక ఆందోళన చెందుతున్న వలసజీవులు. ఇదీ జిల్లాలో ప్రస్తుత పరిస్థితి. మొత్తమ్మీద ఈకేవైసీ ప్రక్రియకు గడువు పొడిగించాలనే డిమాండ్ పెరుగుతోంది.

- 31లోగా పూర్తి చేయాలంటున్న అధికారులు
- రేషన్ దుకాణాలకు క్యూ కడుతున్న ప్రజలు
- మొరాయిస్తున్న యంత్రాలు
- రాత్రి వరకు పడిగాపులు
- వలస కార్మికులకు కష్టాలు
- గడువు పొడిగించాలని వినతులు


ఈకేవైసీ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

సోంపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి)

రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ కష్టాలు వెంటాడుతున్నాయి. బియ్యం కార్డుల్లో పేర్లు కలిగిన వారంతా ఈకేవైసీ చేయించుకోవాలని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ పథకాలు తీసుకొనే ప్రతి ఒక్కరూ తమ వేలిముద్ర (బయోమెట్రిక్) వేసి ఈకేవైసీని పూర్తి చేయాలని అంటున్నారు. ఈనెల 31లోపు ఈ ప్రకియ పూర్తి చేయాలని గడువు విధించారు. ఇప్పటికీ అనేక మంది లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోలేదు. దీనికి ప్రధాన కారణం సాంకేతికంగా ఎదురవుతున్న ఇబ్బందులే. వేలిముద్రల మిషన్లు సరిగా పని చేయకపోవడం...కొందరి వేలిముద్రలు సరిగా పడకపోవడంతో సమస్యలు తలెత్తున్నాయని వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సమస్యలు కూడా ఈకేవైసీ ప్రక్రియకు అడ్డంగా మారుతున్నాయి. అదేవిధంగా కొంతమంది ఆధార్ కార్డు లింక్ పూర్తి కాకపోవడం కూడా అడ్డంకిగా మారుతోంది.

ఎక్కడి నుంచైనా అవకాశం..

రేషన్ కార్డుదారులు ఈకేవైసీని ఎక్కడి నుంచైనా చేయించుకునే వెసులుబాటు ను ప్రభుత్వం కల్పించింది. రేషన్ డీలర్, వీఆర్‌వో, తహసీల్దార్ లాగిన్‌లో చేయించుకునే అవకాశం ఉంది. డీలర్ వద్దకు వెళ్లి కార్డు నెంబరు చెబితే చాలు... ఈ పోస్ యంత్రంలో వివరాలు పొందుపరిచి... కార్డులో ఉన్న సభ్యులకు ఈకేవైసీ పూర్తయిందా లేదా అన్న విషయం చెబుతారు. ఏ సభ్యుడికి పూర్తి కాలేదో వారి ఆధార్ నెంబరు, వివరాలు నమోదు చేసి వేలిముద్ర వేసి అప్‌డేట్ చేస్తే ప్రక్రియ పూరవుతుంది. సచివాలయాల దగ్గర వీఆర్వోల ద్వారా కూడా పూర్తి చేయించుకోవచ్చు. రేషన్ కార్డులు ఉన్నవారు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని సూచిస్తున్నారు. బియ్యం కార్డులో పేరు ఉన్న 6 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్న సభ్యులంతా ఈకేవైసీ పూర్తి చేయాలని అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 19,39,082 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పటివరకు 17,59,569 మంది ఈకేవైసీ చేసుకున్నారు. ఇంకా 1,79,513 మంది ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంది.

వలస కార్మికులకు సమస్య

వలస కార్మికులు తమ స్వస్థలంలో రేషన్ కార్డు కలిగి ఉంటారు. కానీ వారు పనిచేసే ప్రాంతంలో ఈకేవైసీ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శ్రీకాకుళం అంటేనే వలసల జిల్లా. ఈ జిల్లా నుంచి జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాలకు ఎక్కువగా వలసలు వెళుతుంటారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, ముంబాయి వంటి ప్రదేశాల్లో ఎక్కువగా ఈ జిల్లావారే ఉద్యోగాలు, ఇతర పనులు చేస్తున్నారు. ఇలాంటి వారిలో ఎక్కువ మంది రేషన్ మాత్రం ఇక్కడే తీసుకుంటుంటారు. మూడు నెలలకు ఒకసారి వచ్చి ఫించన్లతో పాటు, రేషన్ సరుకులు విడిపించుకొనే పరిస్థితి ఉంటోంది. ఇలాంటి వారికి ఈకేవైసీ చేయించుకోవాలన్న నిబంధన ఇబ్బందిగా మారింది. ఇందులో ఎక్కువ మందికి పిల్లలకు పరీక్షల సీజన్ కావడంతో ఇక్కడికి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటివారు ఎంతోమంది రాలేకపోతున్నారు. వీరి కోసం గడువు పొడిగించాలని కోరుతున్నారు.

డీలర్ల వసూళ్లు

ఈనెల 31వ తేదీలోగా ఈకేవైసీ వేయించుకోవాలన్న ప్రభుత్వ గడువు కొందరు రేషన్ డీలర్లకు వరంగా మారింది. ప్రభుత్వం ఎటువంటి రుసుం లేకుండా ఈకేవైసీ చేయాలని చెబుతోంది. అధికశాతం రేషన్ డీలర్లు మాత్రం ప్రతి కార్డుదారుని దగ్గర రూ.500 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొన్నిచోట్ల లబ్ధిదారులకు భయపెట్టి మరీ వసూలు చేస్తున్నారన్న విమర్శ వినిపిస్తోంది. గడువు దగ్గర పడుతున్న కొద్దీ కొందరు రేషన్ డీలర్లు వసులు మొత్తాన్ని పెంచేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


కలుపుమొక్కలతో నిండిన చెరువును పరిశీలిస్తున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు (ఫైల్)

ఆ కాలనీవాసుల్లో ఆనందం

(మొదటి పేజీ తరువాయి)

ఎదుర్కొంటున్న చెరువు సమస్యను వెలుగులోకి తీసుకొచ్చింది. కలుపు మొక్కలతో చెరువు అధ్వానంగా ఉందని, పాములు, పందుల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు తెలిపారు. చెరువు సమీపంలో గంజాయి బాబుల వికృత చేష్టలతో నివసించలేకపోతున్నామని వివరించారు. సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకున్నారు. దీనిపై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు స్పందిస్తూ ఆ చెరువును పరిశీలించారు. సుందరీకరణ పనులు చేపడతామని నాడు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈ నెల 14న ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా చెరువు చుట్టూ ఉన్న పొదలు, తుమ్మచెట్లను నగరపాలక సిబ్బంది తొలగించారు. అలాగే బుధవారం చెరువులో కలుపు మొక్కలను తీసేశారు. కార్పొరేషన్ కమిషనర్ పీవీవీ ప్రసాద రావు ఆదేశాల మేరకు హెల్త్‌ఆఫీసర్ డా.సుధీర్‌కుమార్ పర్యవేక్షణలో ఈ పనులు చేపట్టారు. నాడు అధ్వానంగా ఉన్న చెరువులో.. నేడు కొద్దిపాటి జలం కనిపించడంతో.. సాయినగర్ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 25ఏళ్ల సమస్యకు మోక్షం లభించిందంటూ 'ఆంధ్రజ్యోతి'కి ప్రజాప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రిమ్స్‌లో వసూళ్ల పర్వం

(మొదటి పేజీ తరువాయి)

అవసరం కాగా కేవలం 26 మంది మాత్రమే ఉండడంతో రోగులకు సేవ లందించడంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

అంబులెన్సులు రెండే...

850 పడకలు ఉన్న రిమ్స్‌లో కేవలం రెండు అంబులెన్స్‌లు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. వాస్తవానికి 5 అంబులెన్స్‌లు ఉన్నా ఇందులో రెండు పూర్తిగా పనిచేయడం లేదు. మరొకటి రిపేరులో ఉంది. జిల్లా నలుమూలల నుంచి రిఫరల్ కేసులను తీసుకురావడానికి ఈ రెండు అంబులెన్స్‌లు ఎలా సరిపోతాయో ఆ దేవుడికే తెలియాలి. అధికారులకు, నాయకులకు ఎన్ని విన్నపాలు చేసినా పరిస్థితిలో మార్పు రావడం లేదని వైద్యులు అంటున్నారు. అలాగే అత్యవసర రోగులను తీసుకువచ్చేందుకు గానీ లేదా రిఫరల్‌పై విశాఖపట్నం తీసుకువెళ్లేందుకు కానీ వెంటిలేటర్ అంబులెన్స్ ఒక్కటే ఉంది. కనీసం మరో ఒక్క వెంటిలేటర్ అంబులెన్స్ అయినా అందుబాటులో ఉంటే ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చు. దీనిపై అధికారులు, నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలి. అలాగే విశాఖ కేజీహెచ్‌కు కేసులను రిఫర్ చేస్తే, సంబంధిత రోగులు అంబులెన్స్‌కు రూ.2,600 అధికారికంగా చెల్లించాల్సిందే. ఈ మొత్తం తమకు ఎంతో భారం అవుతుందని రోగులు వాపోతున్నారు.

మందుల కొరత..

ఎమర్జెన్సీ వార్డుల్లో, క్యాజువాల్టీలో రోగులకు అత్యవసర చికిత్సలు అందజేస్తుంటారు. ఈ సమయంలో వీరికి ఇచ్చేందుకు సాధారణ పెంటాప్రజోల్, పారాసిటమాల్ ఇంజెక్షన్లు కూడా పరిమితంగా అందుబాటులో ఉండడంతో ఏం చేయాలో దిక్కుతోచక వైద్యులు సతమతమవుతున్నారు. అలాగే ఇన్‌ఫెక్షన్లలో వాడే యాంటీబయోటిక్ ఇంజక్షన్లకు కూడా తీవ్ర కొరత ఉందని అంటున్నారు. ఇక అత్యవసర సేవల్లో వినియోగించే డోపమైన్, డోబిటమిన్, ఎట్రోపిన్ వంటి ఇంజక్షన్ల సంగతి ఇక చెప్పనక్కరలేదు. సాధారణ సెలైన్లయిన ఎన్ఎస్, డీఎన్ఎస్, డి-5కు కూడా కొరత ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. శస్త్ర చికిత్సల్లో పాల్గొనే వైద్యులకు స్టెరిలైజ్డ్ గ్లౌవ్స్ కూడా సరిపడినంతగా ఉండడం లేదు. గాయాలు, ఇన్‌ఫెక్షన్లలో కట్టు కట్టేందుకు, వాటిని శుభ్రం చేసేందుకు కూడా సాధారణ గ్లౌవ్స్ వాడాల్సి వస్తుంది. ఆపరేషన్ థియేటర్లలో ఏసీలు సరిగా పనిచేయకపోవడంతో శస్త్ర చికిత్సలు నిర్వహించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదే విధంగా కొవిడ్ సమయంలో ఆసుపత్రికి సరిపడినన్ని వెంటిలేటర్లు అందుబాటులోకి వచ్చాయి. కొవిడ్ అనంతరం వాటిని ఉపయోగించకుండా అలాగే వదిలేశారు. దీంతో వాటిల్లో చాలా వరకు పనిచేయని పరిస్థితి నెలకొంది. అత్యవసర వార్డుల్లోని వెంటిలేటర్లు కూడా సరిగా పనిచేయడం లేదు. కొన్నింటిని రిపేరు చేయిస్తే పునర్వినియోగానికి ఉపయోగపడతాయని వైద్యులు అంటున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నియామకం ఎప్పుడో?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా నేటికీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీని నియమించలేదు. దీనివల్ల ఆస్పత్రిలోని సమస్యలపై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించి, వాటిని పరిష్కరించేందుకు అవకాశం లేకుండా పోతుంది. ఇప్పటికైనా జిల్లా మంత్రి, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు చొరవ చూపి నూతన అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు

ప్రసూతి విభాగంలో అక్రమ వసూళ్లకు పాల్పడరాదని ఇప్పటికే సిబ్బందిని హెచ్చరించాం.. ఎవరైనా వసూళ్లకు పాల్పడితే క్షమించేది లేదు. కఠిన చర్యలు తప్పవు. మందుల కొనుగోళ్లకు సంబంధించి అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. 700 రకాల మందుల లోకల్ కొనుగోళ్లకు సంబంధించి అనుమతులు కూడా తీసుకున్నాం. మరికొద్ది రోజుల్లో మందుల విషయంలో ఎటువంటి సమస్యలు ఉండవు.

- డాక్టర్ షకీలా, రిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్

అమ్మో.. ఓటీపీనా?

- ప్రభుత్వ సర్వేలకు ఇదే కీలకం
- చెప్పడానికి జనంలో సంకోచం
- ఉద్యోగులకు సహాయ నిరాకరణ


ఇలాయిపురంలో సర్వే చేస్తున్న కార్యదర్శి తవిటినాయుడు

మెళియాపుట్టి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఒక సచివాలయంలో పనిచేస్తున్న మహిళా అధికారి సర్వేకు వెళ్లారు. సర్వే చేయాల్సిన కుటుంబానికి సంబంధించిన వ్యక్తులు గ్రామంలో లేకపోవటంతో వారిని ఫోన్‌లో సంప్రదించారు. 'మీ ఇంటికి వచ్చాం. మీరు వర్క్ ఫ్రం హోమ్ చేస్తున్నారా? ఈ సర్వే మీకు ఇష్టమా? లేదా? మీ ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఏమిటి? తదితర వివరాలు నమోదు చేస్తాం. ఓటీపీ చెప్పాల'ని కోరారు. ఆ వ్యక్తి ఓటీపీ చెప్పడానికి ఇష్టపడకపోవటంతో వెనుదిరిగి వచ్చేశారు. మరో గ్రామంలోనూ అదే పరిస్థితి ఎదురైంది. ప్రభుత్వం ఇటీవల కాలంలో చేస్తున్న వివిధ సర్వేల సందర్భంగా ఉద్యోగులకు ఎదురవుతున్న ఇబ్బందులకు ఇది ఉదాహరణ. సర్వే చేస్తున్న సిబ్బందికి ప్రజలు అనేక ప్రశ్నలు వేస్తుడడంతో సచివాలయ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. సైబర్ నేరాలు పెరుగుతుండడం... దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కువగా ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫోన్ చేస్తున్న వ్యక్తులు సచివాలయ ఉద్యోగులో... లేక సైబర్ నేరగాళ్లో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఓటీపీలు చెప్పడానికి వెనకడుగు వేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అనేక సర్వేలు చేసినా డేటాలో అధికంగా తప్పులు కనిపించటంతో కొత్త ప్రభుత్వం మళ్లీ అన్ని వివరాలను సేకరిస్తోంది. దీనికి కొంతమంది సహకరిస్తుండగా... మరి కొంతమంది నుంచి సహాయ నిరాకరణ ఎదురవుతోంది. దీంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

సర్వేలతో ఉక్కిరిబిక్కిరి..

కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత హౌస్‌హోల్డ్ సర్వే నిర్వహించారు. ఇది పూర్తయిన తరువాత వర్క్ ఫ్రం హోం సర్వే జరుగుతోంది. దీంతోపాటు పి-4 సర్వే నడుస్తోంది. వీటన్నిటికీ ఓటీపీ (వన్‌టైం పాస్‌వర్డ్) తప్పనిసరి చేశారు. సంబంధిత యాప్‌లలో వివరాలు నమోదు చేసిన తర్వాత ఓటీపీని నమోదు చేయాలి. ఇక్కడే ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రస్తుతం 11 సర్వేలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అందులో ఇంకా ఎంఎస్ఎంఈ, చిరు వ్యాపారుల సర్వే, పీఎం సూర్యఘర్ తదితర సర్వేలు ఉన్నాయి. వీటితో పాటు రైతుల వివరాలూ సేకరిస్తున్నారు. ఈ సర్వేలపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

సిబ్బందికి సహకరించాలి..

ప్రజలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లే క్రమంలో ప్రభుత్వం సర్వేలు చేయిస్తోంది. దీనికి ప్రజలు సహకరించి... వివరాలు ఇవ్వాలి. ఫోన్‌లో మీ సచివాలయ సిబ్బంది అవునో, కాదో నిర్ధారించుకొని ఓటీపీలు చెప్పడం మంచిది. సచివాలయ సిబ్బంది సైతం గ్రామాల్లోకి వెళ్లినప్పుడు బంధువుల ద్వారా ఫోన్లు చేయించి... ఓటీపీలు తీసుకోవాలి.

-ప్రసాద్‌పండా, ఎంపీడీవో, మెళియాపుట్టి

పేటలో బెట్టింగ్‌లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాలకు మార్చారని సమాచారం. ఆన్‌లైన్ గేమ్స్ కాకుండా ఐపీఎల్ మ్యాచ్ ఆరంభం నుంచి పట్టణంలో జోరుగా బెట్టింగ్ నడుస్తోంది. కొందరు కోడింగ్‌తో వాట్సాప్‌ల ద్వారా బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. బెట్టింగ్ నిర్వాహకులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆరా..

బెట్టింగ్ ముఠాపై చర్యలు తీసుకోవాలంటూ నరసన్నపేటకు చెందిన టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగపు కార్యదర్శి జామి వెంకటరావు.. సామాజిక మాధ్యమాల ద్వారా పోలీసులను కోరారు. 'నరసన్నపేటలోని పెద్దపేటలో ఒక బెట్టింగ్ ముఠా బారిన పడి ఓ బీటెక్ ఇంజనీరింగ్ విద్యార్థి సుమారు రూ.50 లక్షలు పోగొట్టుకున్నాడు. ఇప్పటికీ డబ్బులు కావాలని తల్లిదండ్రులను బ్లాక్‌మెయిల్ చేస్తూ బాధపెడుతున్నాడు. మీరు పెద్ద మనసుతో ఈ విషయమై చర్యలు తీసుకోవాల'ని విజ్ఞప్తి చేశారు. దీంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు ఆ విద్యార్థి తండ్రిని వాకబు చేశారు. తమ కుమారుడు బెట్టింగ్‌లకు పాల్పడి రూ.30లక్షల వరకూ పోగొట్టుకున్నాడని ఆయన తెలిపారు. కాగా.. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి గురువారం నరసన్నపేటలో పర్యటించారు. పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సీఐ, ఎస్ఐలతో చర్చించి.. బెట్టింగ్‌ల వ్యవహారంపై ఆరా తీశారు. సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఆదేశించినట్టు తెలిసింది.

ఆదిత్యుని హుండీల ఆదాయం రూ.7.97 లక్షలు

అరసవల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి హుండీలను గురువారం అలయ అనివెట్టి మండపంలో లెక్కించారు. ఈ హుండీల ద్వారా రూ.7,97,615 ఆదాయం లభించింది. ఇందులో నోట్ల రూపంలో రూ.7,15,730, చిల్లర ద్వారా రూ.81,885 లభించాయి. దీంతో పాటు విదేశీ కరెన్సీ కూడా లభించింది. శ్రీహరి సేవ, సత్యసాయి సేవా సమితి, శ్రీవారి సేవాసమితి వారితో ఈ లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భద్రాజీ, జిల్లా దేవదాయశాఖ అధికారి ప్రసాదరావు పట్నాయక్, ఆమదాలవలస గ్రూప్ దేవాలయాల ఈవో తమ్మినేని రవి, ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయ ఈవో సుకన్య, అర్చకులు ఇప్పిలి రంజిత్‌శర్మ, షణ్ముఖశర్మ, ఫణీంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆహారం కలుషితమై..

(మొదటి పేజీ తరువాయి)

పొందుతున్న విద్యార్థినులను మండల టీడీపీ నాయకులు పరామర్శించారు. విద్యార్థినులకు అందించే తాగునీరు, ఆహారంపై ఎస్ఎస్ఏ అధికారులు శ్రద్ధ వహించాలని కోరారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఈ సంఘటన జరిగిందని ఆరోపించారు. మరోసారి ఇలా జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి తాతారావు, బైరిశెట్టి గున్నయ్య, పుల్లా వాసు, లబ్బ రుద్రయ్య, నవీన్ పాల్గొన్నారు.


విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అధికారులు

ఈవీఎంల భద్రతకు పటిష్ఠ ఏర్పాట్లు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఈవీఎంల భద్రతకు పటిష్ఠమైన చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో గల ఈవీఎం గోదాములను వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈవీఎంల భద్రతా పరంగా ఎటువంటి లోపాలు లేకుండా, కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు మూడు నెలలకోసారి ఈవీఎం గోదాములను తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈవీఎంలను ట్రిపుల్ లాక్ పద్ధతిలో భద్రపరచడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన, వైసీపీ, సీపీఎం, కాంగ్రెస్ తదితర పార్టీలకు చెందిన పీఎంజే బాబు, సురేష్‌సింగ్ బాబు, రౌతు శంకరరావు, ఎం.గోవింద్, బి.అర్జున్ కుమార్, సీహెచ్ భాస్కరరావు, కేవీ ఎల్ఎన్ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బలసలరేవును పరిశీలించిన జేసీ



భూ సేకరణ వివరాలు పరిశీలిస్తున్న జేసీ, ఆర్డీవో

ఆమదాలవలస, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ప్రజలు ఎంతగానో ఉపయోగపడే నాగావళి నదిపై నిర్మించనున్న బలసలరేవు వంతెన ప్రాంతాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ గురువారం పరిశీలించారు. నాగావళి నదిపై సుమారు 40 సంవత్సరాలు నుంచి వంతెన నిర్మాణానికి ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు హామీలు ఇవ్వడం జరుగుతుంది. గత వైసీపీ ప్రభుత్వం కూడా ఆమదాలవలస మండలం తొగరాం గ్రామ పంచాయతీ ఇసుకలపేట సమీపంలో నాగావళి నదిపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా అవి కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇక్కడి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఈ వంతెన నిర్మాణానికి ఒప్పించారు. దీంతో జేసీతో పాటు ఆర్డీవో సాయి ప్రత్యూష, రోడ్లు భవనాలశాఖ డీఈ గణపతిరావు, తొగరాం, కొత్తవలస గ్రామ పంచాయతీ పరిధిలో పర్యటించారు. జేసీ మాట్లాడుతూ నాగావళి నదిపై బలసలరేవు వద్ద వంతెన నిర్మాణం జరిగితే అప్రోచ్ రోడ్డు చేపట్టాల్సి ఉందని, దానికి అవసరమైన భూసేకరణ రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం అనేక అంశాలను పరిశీలించారు. రాగోలు నుంచి తొగరాం మీదుగా ఆమదాలవలసకు సుమారు మూడు కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న బీటీ రహదారి ప్రాంతాన్ని కూడా జేసీ పరిశీలించారు. తహసీల్దార్ ఎస్.రాంబాబు, ఆర్అండ్‌బీ జేఈ శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు జేసీ వెంట ఉన్నారు.

నిధులు కేటాయింపుపై హర్షం

కవిటి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కవిటి బీచ్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి నిధులు కేటాయించడంపై ఆలయ అభివృద్ధి కమిటీ గురువారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీలోని శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు విడుదల చేయించినట్టు తెలిపారు. కమిటీ సభ్యులు బి.పాపయ్యరెడ్డి, ఎం.సీతారాం. బి.రమేష్, ఎ.రాజు, వెంకటరమణ, బి.రవి ఉన్నారు.

బకాయిలు చెల్లించి సహకరించండి

ఆమదాలవలస, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఇంటిపన్నుల బకాయిలు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటిపన్ను బకాయిల వడ్డీలో 50 శాతం మాఫీ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గతంలో ఇంటిపన్ను వడ్డీతో సహా చెల్లించిన వారికి కూడా ఇది వర్తిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ఈ నెల 31వ తేదీలోగా చెల్లించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు సామాజిక తనిఖీల ప్రజావేదిక

లావేరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషరిత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉదయం ఉపాధి పథకం సామాజిక తనిఖీల ప్రజావేదిక సభ నిర్వమించనున్నట్టు ఎంపీడీవో వెంకటరాజు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

నేడు నూకాలమ్మ తల్లి సంబరం

ఇచ్ఛాపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సంతపేట జంక్షన్ వద్ద కొలువు తీరిన నూకాలమ్మ అమ్మవారి సంబరాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కాళ్ల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

భారతదేశం సర్వమతాలకు నిలయం

అరసవల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): భారతదేశం సర్వమతాలకు నిలయమని, రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా జరుపుకుంటారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఇందిరానగర్ కాలనీలో గల మసీదులో ఆయన ముస్లింలతో కలిసి నమాజ్, ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. అలాగే ఆయన కిల్లిపాలెం, విశాఖ-ఏ కాలనీ ప్రాంతాల్లో పర్యటించి డ్రైనేజీలు, సీసీ రోడ్లను పరిశీలించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, సచివాలయ సిబ్బంది, వార్డు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సిద్ధంగా ఉండాలి

అరసవల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యరంగంలో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు వైద్యారోగ్య శాఖ సిబ్బంది సిద్ధంగా ఉండాలని డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో గురువారం స్టాఫ్ నర్సులకు, ఏఎన్ఎంలకు నిర్వహించిన మూడు రోజుల విస్తృత ఆరోగ్య సేవల విస్తరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నోటి ఆరోగ్యం, కేన్సర్, మానసిక ఆరోగ్యం, స్త్రీ సంబంధిత వ్యాధులు, వృద్ధాప్య సేవలు, మాతాశిశు సంరక్షణ తదితర విషయాలపై అవగాహన ఉండాలన్నారు. డాక్టర్ రవీంద్ర, వాన సురేష్‌కుమార్, మాస్టర్ ట్రైనీలు జీవీ లక్ష్మి, డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ ఉషశ్రీ పాల్గొన్నారు.

కార్మికుల భద్రతపై దృష్టి సారించాలి

అరసవల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కార్మికశాఖ జిల్లా ఉప కమిషనర్ కె.అజయ్ కార్తికేయ పరిశ్రమల యజమానులకు సూచించారు. వేసవి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే ఎక్కువగా నమోదవుతున్నాయని, వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. జాతీయ డేటా బేస్ ఈ-శ్రమ్ పోర్టల్ కార్మికులు తమ వివరాలను ఈ నెల 31వ తేదీలోగా నమోదు చేసుకుని బీమాకు అర్హత పొందాలన్నారు.

ఐపీఆర్‌పై అవగాహనతో మరింత ప్రగతి

ఎచ్చెర్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మేథో సంపత్తి హక్కులు (ఐపీఆర్)పై సరైన అవగాహన, లోతైన విజ్ఞానం కలిగి ఉంటే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల నిర్వాహకులు మరింత ప్రగతి సాధించవచ్చని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీధర్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఏపీ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ, జిల్లా పరిశ్రమల కేంద్రం, వర్సిటీ ఆర్ అండ్‌డీ, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాలు సంయుక్తంగా గురువారం ఐపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత, ఎంఎస్ఎంఈ సీఈవో జి.సుదర్శన్, నోవెల్ పేటెంట్ సర్వీసెస్ ప్రతినిధి రాజు, ఎల్‌డీఎం సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సస్పెన్షన్ ఎత్తివేయాలి

గుజరాతీపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై అక్రమ సస్పెన్షన్లు రద్దు చేసి, వారికి విధుల్లోకి తీసుకురావాలని జనవిజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ చేశారనే నెపంతో అక్కడ ఉపాధ్యాయులు, అధికారులపై వేటు వేసి భయభ్రాంతులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం డీఈవో నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. ఉపాధ్యాయులను మానసికంగా ఆందోళనకు గురిచేసిన డీఈవోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

చర్యలు ఉపసంహరించాలి

అరసవల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): టెక్కలి మండలం పెద్దసాని ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయునిపై తీసుకున్న చర్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం సాయంత్రం డీఈవో ఎస్.తిరుమల చైతన్యను కలిసి వినతిపత్రం అందించారు. అందరు విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో సమగ్ర విచారణ జరిపి, తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కె.వైకుంఠరావు, కార్యదర్శి సూర్యప్రకాశరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన ఆమదాలవలస మండలం, వంజంగిపేట గ్రామ కాపురస్థుడు **వావిలపల్లి వెంకన్నగారి** కుమారుడు **వావిలపల్లి రమణమూర్తి** ఇచ్చిన భోగట్టా మేరకు యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని **చల్లా గణేశ్వరరావు** వగైరాలు నుండి రిజిష్టరు క్రియచీటి దాక్యుమెంటు నెంబరు 4533/2011గ కొనుగోలు చేసియుండిరి. సదరు ఆస్తిపైన నా క్లయింటుకు దాన విక్రయాధి సమస్త హక్కులతో దఖలు పడియున్నవి. నా క్లయింటు సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిని **స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కొర్లకోట జంక్షన్ బ్రాంచి** నందు తనఖా పెట్టుటకు నిర్ణయించియున్నారు. సదరు ఆస్తిపైన ఎవరికి యెట్టి అభ్యంతరములు ఉన్నయెడల ఈ క్రింది చిరునామాయందు ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి 10 దినములలోగ తెలియజేయగలరు. లేనియెడల సదరు ఆస్తిని నిరభ్యంతరమైన ఆస్తిగా పరిగణించబడును.

షెడ్యూలు ఆస్తి వివరం : శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం సబ్.డి., శ్రీకాకుళం మండలం, రాగోలు గ్రామ పంచాయితీ, రాగోలు రెవెన్యూ గ్రామము, ప్లాట్‌నెం. 25, గ్రామ పంచాయితీ రాగోలు తీర్మాణం నెం.7, తే. 05.08.2000ది ఎప్రూవల్ కాబడిన లే-అవుట్‌లోని ఖాళీస్థలం తూర్పు-పడమరలకు 25అ॥ అనగా 7.62మీ॥ మరియు ఉత్తర-దక్షిణలకు 60అ॥ అనగా 18.288మీ॥ కొలతలు కలిగిన 166.666చ.గ., లేదా 139.354చ.మీ., విస్తీర్ణం గల సర్వే నెంబరు 231/4లో చేరియున్నటువంటి ఆస్తికి **హద్దులు: తూర్పు:** ప్లాట్‌నెం.24 ఖాళీస్థలం, **దక్షిణ:** గోర్జ, **పడమర:** ప్లాట్‌నెం.26 ఖాళీస్థలం, **ఉత్తర:** 24అ॥ వెడల్పు గల లే-అవుట్ రోడ్డు.

ఆమదాలవలస
తే.25.03.2025ది.

పి.వి.నరసింహులు
అడ్వకేట్
బి.ఆర్.నగర్, ఆమదాలవలస, శ్రీకాకుళం

చింతాడ సంత ఆశీల వేలం ఖరారు

ఆమదాలవలస, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధి 7వ వార్డు పరిధిలోని చింతాడ సంతకు నిర్వహించిన ఆశీల వేలం పాట ఎట్టకేలకు ఖరారైంది. గురువారం పురపాలక సంఘ కార్యాలయంలో మేనేజర్ బిషోయ్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి నిర్వహించిన వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో బోర హరనాథ్, బోర భారతి పాల్గొన్నారు. భారతి రూ.7.62 లక్షలకు కైవసం చేసుకున్నారు. దీనికి అదనంగా రూ.లక్ష స్వీపర్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని మున్సిపల్ ఆర్ఐ తమ్మినేని గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ విభాగ సీనియర్ అసిస్టెంట్ జామి శ్రీనివాసరావు, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజమే ఓ రంగస్థలం

ఆమదాలవలస, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సమాజమే ఒక రంగస్థలమని, కళలతోనే సమాజ ప్రగతి సాధ్యమని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. గురువారం పట్టణంలోని పాలపోలమ్మ గుడి ఆవరణలో కళాకారుల సంఘం అధ్యక్షుడు టీకే త్రినాథరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ కళాకారుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాకారుల సంఘ గౌరవాధ్యక్షులు బంకుపల్లి శ్రీరామ చంద్రమూర్తి, కార్యదర్శి బగాది వెంకటరావు, టీడీపీ నాయకులు నూకరాజు, వైద్యులు పి.తాతయ్యలు, పారి శ్రామికవేత్త మోహన్‌రావు తదతరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం

సోంపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బారువ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో 34 ఏళ్ల మానసిక దివ్యాంగురాలిపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడినట్టు ఎస్ఐ హరిబాబు నాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బాధితురాలు ఉదయం స్నానం చేస్తుండగా ఆ వ్యక్తి ఇంటిలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. అదే సమయంలో ఆమె తండ్రిరావడంతో పారిపోయినట్టు తెలిపారు. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

46 మంది రక్తదానం

ఇచ్ఛాపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సినీహీరో రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆంధ్రా-ఒడిశా గంజాం జిల్లా రామచరణ్ అభిమానులు ఆధ్వర్యంలో 46మంది రక్తదానం చేశారు. గౌరీ శంకర్, పూర్ణ, డిల్లేష్, మణికంఠ, తిప్పన దుర్యోధనరెడ్డి, సాగర్ పాల్గొన్నారు.

శక్తియాప్‌తో మహిళలకు భద్రత

బూర్జ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శక్తియాప్‌తో మహిళలకు భద్రత లభిస్తుందని ఎస్ఐ ప్రవల్లిక అన్నారు. శక్తియాప్‌తో కలిగే ప్రయోజనాలపై లాభాం గ్రామంలో గురువారం అవగాహన కల్పించారు. డయల్ 112, ఎస్ఎంఎస్ బటన్ ఆపద సమయంలో ఉపయోగించుకోవచ్చునన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నియోజకవర్గ అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు



విలేకరులతో మాట్లాడుతున్న కూటమి నాయకులు

రణస్థలం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో ఎచ్చెర్ల నియోజకవర్గం అభివృద్ధి చూసి మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఓర్వలేక తమ నాయకుడు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావుపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కూటమి నాయకులు ముప్పుడు సురేష్, బెండు మల్లేశ్వరరావు, రవి, పిషిని జగన్నాథంనాయుడు అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆటవిడుపుగా ఎన్‌ఈఆర్ 11వ నెంబరు అంటూ స్కిట్ చేశారని, ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినేలా చేయలేదన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు డీజీఎం ఆనందరావు, లుకలాపు అప్పలనాయుడు, పిన్నింటి మధు, గొర్లె సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఇచ్ఛాపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఈదుపురం జిల్లా పరిషత్ పాఠశాలలో క్లస్టర్ లెవల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. గురువారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఇన్నేసుపేట పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం, పూర్ణాటకం పాఠశాల ద్వితీయ స్థానం, కొఠారి పాఠశాల విద్యార్థులు తృతీయస్థానం, తిప్పన పుట్టుగ పాఠశాల విద్యార్థులు నాలుగో స్థానంలో విజేతలుగా నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉపాధ్యాయుల అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలి



నిరసనలో పాల్గొన్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని, వారిపై బనాయించిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ ఐక్య ఉపాధ్యాయ సంఘాల వేదిక ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎచ్చెర్ల మండలం కుప్పిలి పరీక్ష కేంద్రంలో జరిగిన ఘటనపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డీఈవో తిరుమల చైతన్య అక్రమాలపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘాల నేతలు చౌదరి రవీంద్ర, మజ్జి మదన్‌మోహన్, తంగి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్యాంపిస్టన్స్ లేఆఫ్ ప్రతిపాదన అడ్డుకోవాలి

అరసవల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శ్యాంపిస్టన్స్ పరిశ్రమలో కార్మికుల లేఆఫ్ ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. రణస్థలం మండలంలో గల శ్యాంపిస్టన్స్ ప్లాంట్-2లో 200 మంది కార్మికులను లేఆఫ్ చేయకుండా ప్రభుత్వం అడ్డుకోవాలని కోరారు. ఈ నెల 29న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



పవర్‌ప్లాంట్ ప్రతిపాదనలు విరమించుకోవాలి

ఆమదాలవలస, మార్చి 27(ఆంధ్రజ్యోతి): థర్మల్ పవర్‌ప్లాంట్ వల్ల మానవాళి మనుగడకే ప్రమాదమని, ఈ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వెన్నెలవలస, మశానపుట్టి, జంగాలపాడు గ్రామాల్లో ప్రజా సంఘాల నాయకులు పర్యటించారు. ఆదివాసీలు చేస్తున్న పోడు వ్యవసాయాన్ని వెన్నెలవలస రిజర్వాయర్‌ను పరిశీలించారు. అనంతరం వెన్నెవలసలో పోరాట కమిటీ నాయకులు సవర సింహాచలం అధ్యక్షతన జరిగిన సభలో పౌర హక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు పి.దానేష్, కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, పీడీఎం రాష్ట్ర నాయకులు పాలిన వీరాస్వామి, పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ తన స్వప్రయోజనాల కోసం ఈ ప్రాంత విధ్వంసాన్ని కోరుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పీకేఎస్ జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధన, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, రాష్ట్ర కమిటీ సభ్యులు వంకల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దృశ్యం





ఆ ఐదు కులాలను ఓబీసీలో చేర్పించాలి



న్యాయశాఖ మంత్రితో మాట్లాడుతున్న రామ్మోహన్

శ్రీకాకుళం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని శిష్టకరణం, కళింగ కోమటి, తూర్పు కాపు, సొండి, అరవల కులాలను ఓబీసీలో చేర్చాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషిచేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం న్యూఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి వీరేంద్రకుమార్‌తో పార్లమెంట్ హాల్‌లో రామ్మోహన్ భేటీ అ య్యారు. ఐదు కులాలకు చెందిన ప్రతినిధులతో కలిసి వినతి పత్రాన్ని న్యాయశాఖ మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలను న్యాయశాఖ మంత్రికి వివరించారు.

శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శివప్రసాద్



శ్రీకాకుళం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

గుజరాతీపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తంగి శివ ప్రసాదరావు గెలుపొందారు. గురువారం ఉదయం నుంచి జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఇప్పిలి సీతారాజు, జనరల్ సెక్రటరీగా పిట్ట దామోదరరావు, లేడీ రిప్రజెంటేటివ్‌గా వనజాక్షి గెలుపొందారు. ట్రెజరర్‌గా కొమర శంకరరావు, జాయింట్ సెక్రటరీగా ఎం.భవానీ ప్రసాద్, స్పోర్ట్స్ సెక్రటరీగా త్రిపురాన వర ప్రసాద్, లైబ్రరీ సెక్రటరీగా కె.రమణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సీనియర్ అడ్వకేట్స్ టి.రాధాకృష్ణ, ఎన్.విజయకుమార్ వ్యవహరించారు.

సోంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శైలేంద్ర



శైలేంద్ర

సోంపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సోంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది జీఎస్ శైలేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోర్టు ఆవరణలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా సిలగాన భాస్కరరావు, కార్యదర్శిగా వజ్జ గోపి, సంయుక్త కార్యదర్శిగా దున్న జోగారావు, కోశాధికారిగా బొడ్డ ధర్మారావును ఎన్నుకున్నారు. వీరికి తోటి న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

గార, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 117 వల్ల విద్యా వ్యవస్థకు ఎంతో నష్టం జరిగిందని, అందువల్లే ఈ జీవోను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఎంఈవోలు నక్క రామకృష్ణ, టి.వినోదిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రామ్మోహన్‌రావు, కార్యాలయ ఏవో రఘు తదితరులు పాల్గొన్నారు.

3న ఉద్యోగావకాశాలపై సదస్సు

శ్రీకాకుళం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య రంగాల్లో నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలపై వచ్చే నెల 3న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం రాగోలులో జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ముఖ్యఅతిథిగా కిమ్స్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు హాజరుకానున్నట్టు తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు వైద్య, ఆరోగ్య రంగంలో విస్తృత ఉద్యోగ అవకాశాలపై ఈ సదస్సులో వెల్లడిస్తారని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు గూగుల్ లింక్‌లో తమ పేర్లను వచ్చే నెల 2వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 ఫోన్ నెంబర్లలో గాని, నేరుగా రాగోలులో జెమ్స్ వైద్య కళాశాలలో గల 'బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ' ప్రతినిధులను సంప్రదించాలని కోరారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

కంచిలి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్. ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. పెద్దశ్రీరాంపురం గ్రామంలో రూ.1.66కోట్ల ఉపాధి హామీ నిధులతో మూడు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామానికి కావలసిన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాదిన విమల, తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎస్ఐ పి.పారినాయిడు, టీడీపీ నాయకులు బంగారు కురయ్య, మాదిన రామారావు, మర్రిపాటి పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

30న బైరో భజన పోటీలు

జి.సిగడాం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ప్రధాన వీధిలో ఉగాది పర్వదినం సందర్భంగా మండల కళాకారులు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండల స్థాయి బైరో భజన పోటీలు నిర్వహించనున్నట్టు కన్వీనర్ డీఎం రామం గురువారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తామన్నారు. భోజన వసతి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 6304350985, 8008254638, 8074549240 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

మద్దతు ధరకే అపరాల కొనుగోలు



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

బూర్జ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే అపరాలు కొనుగోలు చేస్తున్నట్టు ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణంనాయుడు అన్నారు. ఈ మేరకు గురువారం పెద్దపేట రైతు సేవా కేంద్రంలో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా అపరాల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మద్దతు ధరకే మినుములు క్వింటా రూ.7,400, పెసలు రూ.8,682 కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. దళారులను నమ్మి తక్కువ ధరలకు విక్రయించి రైతులు నష్టపోవద్దన్నారు. జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా గోదాములు త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు, మందులు, విత్తనాలు రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. మార్క్‌ఫెడ్ డీఎం రమణి, వ్యవసాయ శాఖ ఏడీ రాజగోపాల్, ఆర్బ్ డైరెక్టర్ నూక సన్యాసిరావు, నీటి సంఘం అధ్యక్షుడు కడగల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల భయంతో వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాగోలు సమీపంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తన తమ్ముడికి చికిత్స చేయిస్తూ.. అతడు చనిపోతాడని వైద్యులు సూచాయగా చెప్పడంతో వ్యాపారంలో అన్నదమ్ములిద్దరూ కలిసి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ కె.రాము తెలిపిన వివరాల మేరకు.. సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన శెట్టి సూరి(40) అతడి తమ్ముడు ఉమామహేశ్వరరావు కలిసి గ్రానైట్ వ్యాపారం చేసేవారు. వ్యాపారంలో నష్ట రావడంతో ఉమామహేశ్వరరావు బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అతడ్ని చికిత్స నిమిత్తం రాగోలు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సూరి,కుటుంబసభ్యులు చేర్పించారు. అయితే వైద్యులు ఉమామహేశ్వరరావు బతకడం కష్టమని చెప్పడంతో చేసిన అప్పులు తీర్చలేనేమోనన్న భయంతో ఆసుపత్రిగేట్ వద్ద అద్దెకు తీసుకున్న గదిలోఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాము ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.సూరికి భార్య ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

పొందూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పెనుబర్తి అండర్ వే బ్రిడ్జి సమీపంలో గురువారం గుర్తుతెలియనివ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడని జీఆర్‌పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. మృతుని వయస్సు 35 ఏళ్లు ఉండొచ్చని, ఎరుపురంగు షర్టు, తెలుపురంగు బనియను ధరించి ఉన్నట్టు తెలిపారు. వివరాలు తెలిసినవారు 9493474582 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

10.3 కిలోల గంజాయి స్వాధీనం

ఇచ్ఛాపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి వస్తున్న ఓ మహిళ నుంచి 10.3 కిలోల గంజాయితీని స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ (మొబైల్ టీం) సీఐ జీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒడిశా రాష్ట్రం అడపంక గ్రామానికి చెందిన రంజుమాలిక్ అనే మహిళ ట్రైన్ ద్వారా హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేసే క్రమంలో గురువారం సాయంత్రం ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు వస్తుండగా పట్టుబడింది. ఆమెను అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈమెకు సరఫరా చేస్తున్న వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.25వేలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో విఠలేశ్వరరావు, శ్రీనివాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సభ్యులు, శ్రీకాకుళం టీం సభ్యులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై దర్యాప్తు

నరసన్నపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సంతపేటలో కులం పేరుతో దూషించారని దుంగ రుతమ్మ ఫిర్యాదు మేరకు గురువారం టెక్కలి డీఎస్పీ డీఎస్‌ఆర్ మూర్తి దర్యాప్తు నిర్వహించారు. భవానీపురానికి చెందిన బి.అనీల్ తనను కులంపేరుతో దూషించడమే కాకుండా వ్యక్తిగతంగా దౌర్జన్యానికి పాల్పడినట్లు డీఎస్పీ దర్యాప్తులో బాధిత మహిళ కుటుంబ సభ్యులు తెలిపారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ల నుంచి రూ.6.97 లక్షల రికవరీ

● టెక్కలిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక



టెక్కలిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న పీడీ

టెక్కలి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): టెక్కలి మండలంలోని 27 పంచాయతీల్లో గల 35మంది ఫీల్డ్‌అసిస్టెంట్ల నుంచి రూ.6 లక్షల 97వేలు రికవరీకి డుమా పీడీ బి.సుధాకర్ ఆదేశించారు. గురువారం టెక్కలి మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీప్రజావేదిక నిర్వహించారు. బూరగాం, పాతనౌపడా, బొప్పాయిపురం, గూడేం ఫీల్డ్‌అసిస్టెంట్లకు సంబంధించి వేతనదారుల మస్టర్ల దిద్దుబాట్లు, సంతకాలు లేకుండా చెల్లింపులు, వేతనదారులు వద్ద మేట్, ఫీల్డ్ అసిస్టెంట్లు కలిపి వసూళ్ల వంటి అంశాలను సోషల్ ఆడిట్ బృందంతనిఖీల్లో గుర్తించినట్లు తెలిపారు.వీరి నుంచి రికవరీ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాతనౌపడాలో లక్షా25వేలు, బూరగాంలో రూ.లక్షా20వేలు, బొప్పాయిపురంలో రూ.95వేలు అక్రమాలు జరిగినట్లు గుర్తించామని తెలిపారు. మండలంలో ఐటీడీఏ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఎస్ఎస్‌పీ విభాగాల నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.17కోట్ల 14లక్షలతో 1,877పనులు నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో కోటి71 లక్షల మెటీరియల్ కాంపోనెంట్ పనులు, రూ.15కోట్ల43లక్షలు వేజ్ కాంపో నెంట్ పనులు నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో విజిలెన్స్ డీడీవో స్వరూ పారాణి, ఏపీవోలు రాధ, శైలజ, ఎస్ఆర్‌పీ తిరుపతిరావు,ఎంపీడీవో లక్ష్మీబాయి, ఏపీవో బగాది ప్రసాదరావు, ఎంపీపీ సరోజినమ్మ, మండల ఇంజనీరిం గ్‌అధికారి లక్ష్మునాయుడు, హౌసింగ్ ఏఈ సంగమేశ్వ రరావు పాల్గొన్నారు.

జీవనోపాధి ప్రణాళికలపై శిక్షణ



నందిగాం: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం మనోరత్నం

పలాసరూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి) :పలాస వెలుగు కార్యాలయంలో గురువారం 2025-26 ఆర్థికసంవత్సరలో స్వయంసహాయక సంఘాలకు వార్షిక అప్పులు, జీవనోపాధుల ప్రణాళికల తయారీపైమండల స్థాయిలో ఎన్యుమరేటర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్‌డీఏ ప్రత్యేక అధికారులు కె.ఈశ్వరరావు, చిట్టిబాబు ఆరేసీ సంఘాలకు ప్రణాళికలు తయారు చేయడానికిఎన్యుమరేటర్‌ను నియమించి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఏపీఎం కె.జాంభవతి, మహిళాసంఘ అధ్యక్షురాలు కె.పార్వతి, సీసీ ఎస్‌పీ.నాగమ్మ, పి.కళ్యాణి, సభ్యులు పాల్గొన్నారు.

●కోటబొమ్మాళి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జీవనోపాదుల ప్రణాళికలు తయారు చేయడం, 2025-26 వార్షిక క్రెడిట్‌పై ప్రతి ఆరు సంఘాల్లో విద్యావంతులైన సేవాభావం ఉన్న వారిని ఎన్యుమరేటర్‌గా నియమించి యాప్‌లు వినియోగంపై శిక్షణ ఇవ్వాలని జిల్లా వెలుగు ప్రాజెక్టు బ్యాంకు లింకేజీ డీపీఎం ఎ.నాగలక్ష్మి కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళ స్వయంశక్తి సభ్యులసభ్యులకు యాప్‌ల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలోవెలుగు ఏసీ ఎస్.శ్రీరాములు, ఏపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●నందిగాం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నందిగాం వెలుగు కార్యాలయంలో సెర్ప్ నేతృత్వంలోస్వయం సహాయక సంఘాల్లో క్రెడిట్, లైవ్‌హుడ్ అంశాలపై ఎన్యుమరేటర్లు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం పి.మనో రత్నం, డీహెచ్ ఏపీఎం ధనలక్ష్మి ప్రణాళికలు తయారీపై వివరించారు.

చిన్నారుల్లో నైపుణ్యాలను గుర్తించాలి

కొత్తూరు, మార్చి27(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో నైపుణ్యతను గుర్తించాలని కొత్తూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్, డీఆర్పీ లింగాల శాంతకుమారి కోరారు. గురువారం కొత్తూరులోఅంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు.

షెడ్ లేక.. పార్కింగ్‌కు అగచాట్లు

● త్వరగా పాడవుతున్న సైకిళ్లు
● ఇదీ గార జడ్పీ ఉన్నతపాఠశాల ఆవరణలో పరిస్థితి

గార, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):గార జడ్పీ ఉన్నతపాఠశాల ఆవరణలో షెడ్ లేకపోవడం వల్ల విద్యార్థులు సైకిళ్ల పార్కింగ్ చేయడానికి అగచాట్లకు గురవుతున్నారు.సైకిళ్ల పాఠశాల ఆవరణలో ఆరుబయట పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఎండకు ఎండి వర్షానికి తడిచి తప్పుపట్టి టైర్లు దెబ్బ తింటున్నాయి. ఇక్కడ ఆరు నుంచి పదో తరగతి వరకు 500 మంది చదువుతుండగా, ఇందులో 200 మందిబూరవల్లి, శాలిహుండాం, పూసర్లపాడు, తూలుగు తదితర గ్రామాల నుంచి సైకిళ్లపై పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. సైకిళ్ల నిర్వహణకు నోచుకోకపోవడంతో త్వరగా పాడవుతున్నాయి. ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న ఈగ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో సైకిళ్లపై వస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి సైకిల్‌షెడ్ ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.



పాఠశాల ఆవరణలో ఆరుబయట పార్కింగ్ చేసిన సైకిళ్లు

రోడ్లు లేక.. కాలువలకు నోచుకోక

● ఇదీ ఎస్ఎంపురం రాజీవ్ స్వగృహ కాలనీలో పరిస్థితి



రాజీవ్ స్వగృహాలో అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డు

ఎచ్చెర్ల,మార్చి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఎంపురం కొండపై రెండుదశాబ్దాల కిందట నిర్మించిన రాజీవ్ స్వగృహ (అన మిత్రటౌన్‌షిప్) కాలనీలో సమస్యలు తిష్ఠవేశాయి. ఇక్కడ అంతర్గత రోడ్లుసైతంలేవు. కాలువలు నిర్మించకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరుతుండడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా ఇక్కడ రోడ్లు, కాలువలతోపాటు తాగునీటి వంటి కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ టౌన్‌షిప్ ప్రారంభించగా, ఇందులో అప్పట్లో 540 ప్లాట్ల నిర్మాణాలుచేపట్టారు. వీటిలో 100 ప్లాట్లు నిర్మాణం పూర్తికాగా, మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో మిగిలాయి. కాగా ప్రధాన సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయ్యిందని, అంతర్గతంగాఉన్న 30 బీటీరోడ్ల నిర్మాణం చేపట్టామని, వీటినిర్మాణం ఈనెలాఖరకు పూర్తవుతాయని అనమిత్ర టౌన్‌షిప్ ఏజీఎం సంతోష్ తెలిపారు. వీధి దీపాలకు టెండర్లు ఖరారయ్యాయని, మురుగు నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు టెండర్లు పిలుస్తున్నట్లు చెప్పారు.

స్పీడ్‌బ్రేకర్లు లేక.. పొంచిఉన్న ప్రమాదం

● ఇదీ అక్కుపల్లి జంక్షన్ మలుపులో పరిస్థితి

వజ్రపుకొత్తూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి):మండలంలోని అక్కుపల్లి జంక్షన్ నుంచి మెట్టూరు తోటూరు వరకు బీటీరోడ్డు మలుపుల్లో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ మలుపు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు సైతం ఏర్పాటుచేయకపోవడంతో ప్రమాదం పొంచిఉంది. ఈమార్గంలో కొత్తగా వాహనాలపై వచ్చేవారు ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తోటూరు తీరం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుండడంతో పలు ప్రాంతాల నుంచి నిత్యంపర్యాటకులు ఈమార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. ఈతరుణంలో ఇక్కడ మలుపులు జరగకుండా ఆర్అండ్‌బీ, పర్యాటకశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ప్రమాదకంగా ఉన్న అక్కుపల్లి -తోటూరు మలుపు

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం చెన్నాపురంలో టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు దన్నుగా టీడీపీ ఉంటుందని తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్డు వల్ల ఒక్కో కుటుంబానికి రూ.ఐదు లక్షలు బీమా సదుపాయం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంల టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మండల పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



నరసన్నపేట: చెన్నాపురంలో టీడీపీ సభ్యత్వ కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పేదలను ఆర్థికంగా ఆదుకోవడమే ధ్యేయం

పోలాకి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు ఆర్థికంగా ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి తెలిపారు. గురువారం మబగాంలోని క్యాంపు కార్యాలయంలో దీర్ఘాశి, తలసముద్రం గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పాతపట్నం: మాట్లాడుతున్న మామిడి గోవిందరావు

పాతపట్నం, మార్చి27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. గురువారం పాతపట్నంలోని 50 పడకల సీహెచ్‌సీలో డిజిటల్ ఎక్స్‌రే విభాగాన్ని ప్రారంభించారు. తొలుత ఆసుపత్రిలో పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైద్యులు చిత్తశుద్ధితో వ్యవహరించి రిఫర్‌చేయడానికి ప్రాధాన్యతనివ్వకుండా సేవలందించాలని కోరారు. 100పడకల ఆసుపత్రిగా రూపొందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రకుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు పాల్గొన్నారు.

●కొత్తూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామీణ రహదారులు అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. మండలంలోని సిరుసువాడ-కుంటిబద్ర గ్రామాల లింకు రోడ్డుకు సిరుసవాడలో ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఎల్.తులసీ వరప్రసాదరావు, సర్పంచ్ పోలినాయుడు, అగతముడి అరుణకుమార్, పొత్రకొండ మోహనరావు, పడాల లక్ష్మణరావు, అగతముడి మాధవరావు, సుధాకరరావు పాల్గొన్నారు.

ఎక్కువ పనిచేస్తున్నా తక్కువ కూలి

● ఏపీఎంను నిలదీసిన వేతనదారులు ● హిరమండలంలో నిరసన



ఉపాధి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వేతనదారులు

హిరమండలం, మార్చి27(ఆంధ్రజ్యోతి): తాము ప్రతి రోజూ రెండు పూటలా మండుటెండలో ఎక్కువగా పనిచేస్తున్నా,తక్కువ కూలి వస్తోందని హిరమండలం, చిన్నకోరాడ, సుభలయ ఆర్ఆర్ కాలనీకి చెందిన వేతనదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వీరంతా కొండరాగోలు సమీపంలోని ఎర్రచెరువులో ఆరురోజులుగా చెరువు పనులు చేస్తున్నారు.ఉదయం,సాయంత్రం రెండుపూటల పనిచేస్తున్నా ఆరు రోజుల పని దినాలకు మస్టర్లలో ఐదురోజులకు పనినమోదుచేసి రూ.600 మాత్రమే వేతనం చెల్లిస్తున్నారని వాపోయారు. ఈమేరకు గురువారం హిరమండలం ఉపాధిహామీ పథకం కార్యాలయం వద్ద రెండు వందల మంది వేతనదారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజూ రెండు పూటలా కష్టపడి పనిచేస్తే వంద రూపాయలే వస్తోందని, ఈ మొత్తం రవాణా చార్జీలకే సరిపోవడంలేదని వాపోయారు. ఆరు కిలోమీటర్లు ఆటోపైవెళ్లి పనులు చేస్తున్న తమకు తక్కువ వేతనం రావడంపై ఏపీఎం శ్రీనివాసరావును నిలదీశారు. పనికి కొలతలు మేర మాత్రమే వేతనం చెల్లిస్తామని ఏపీఎం శ్రీనివాసరావు తెలిపారు. వేతనదారులు ప్రభుత్వ నిబంధనలు మేరకు సమయానికి పనికి వెళ్లడంలేదని చెప్పారు.

పెద్దతామరాపల్లిలో ఆవుదూడల ప్రదర్శన



తామరాపల్లిలో దూడల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

నందిగాం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దతామరాపల్లిలో ఆవుదూడల ప్రదర్శన నిర్వహించారు.గురువారం పెద్దతామరాపల్లిలో టెక్కలి నియోజకవర్గ ఓ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు నిర్వహించారు. పోటీల్లో 30 దూడలు పాల్గొనగా ప్రథమ బహుమతి గేదెల కృష్ణారావు(పోతులూరు), తమిరె లక్ష్మీనారాయణ (బెజ్జిపల్లి),బొడ్డ భారతి(వేములవాడ) మొదటిమూడు బహుమతులు గెలుచుకోగా మొదటిబహుమతి రూ.30వేలు చిన్నమనాయుడు, రెండో బహుమతి రూ.20వేలు పోలాకి వాసు, మూడో బహుమతి రూ.15వేలు వంకల దివాకర్ అందించారు. ఈసందర్భంగా రైతులతోపాటు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన పశుసంవర్ధకశాఖ ఏడీ రవికృష్ణ, పశువైద్యాధికారి జి.మన్మథరావును సన్మానించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్,బలరాం, రాజశేఖర్, తూలుగు మహేష్, దేవేంద్రరావు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించండి

● జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

పలాసరూరల్,మార్చి27(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో సారా నిర్మూలనకు గ్రామస్థులు సహకరించాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి కోరారు.గురువారం మండలంలోని పెదంచలలో సారా నిర్మూలనకోసం చేపడుతున్న నవోదయం-2.0 కార్యక్రమం ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సారా అమ్మకం, కొనుగోలు, సేవించడం చట్ట రీత్యా నేరమని, ప్రభుత్వం అటువంటి వారిని కఠినంగా శిక్షిస్తుందని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.కళ్యాణచక్రవర్తి,ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు, సర్పంచ్ వి.రామారావు పాల్గొన్నారు.

పథకాలపై వృద్ధులకు అవగాహన తప్పనిసరి

టెక్కలి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులకు పథకాలపై అవగాహన తప్పనిసరి అని జిల్లా వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత తెలిపారు. గురువారం స్థానిక విశ్రాంతి ఉద్యోగుల సంఘ భవనంలో వయో వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా సీనియర్ సిటిజన్లకు ఐడీ కార్డులకు వచ్చిన దరఖాస్తులు పరిశీలించి 300 మందికి కార్డులను జారీచేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షులు ఆర్.రామచంద్రరావు, బొడ్డ అయ్యబాబు, హరిశ్చంద్రరావు, జీవీరెడ్డి పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో సాగుచేయాలి

ఎల్.ఎన్.పేట,మార్చి 27(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో ఆహారపంటలను సాగు చేయాలని జిల్లా అడిషనల్ డీపీఎం ధనుంజయరావు తెలిపారు. గురువారం ఎల్.ఎన్.పేట వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల వీవోఏలు, వీటీబీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీఎం రవిరాజ్, లలిత, రమణమూర్తి పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై విద్యార్థులకు శిక్షణ



ప్రథమ చికిత్స విధానాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

పలాస, మార్చి 27(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనడంపై విద్యార్థులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొగ్రామ్ మేనేజర్ జి.రమణ, ఎస్.ఉమాశంకర్, ఎల్.గణపతిరావు, కళాశాల పిడి మధు, అధ్యాపకులు రమణ, శ్రీనివాస్‌పట్నాయక్ పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై కలెక్టర్‌కు నివేదిక



మట్టి తవ్వకాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ కల్యాణచక్రవర్తి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పలాస, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కంబిరిగాం-కేదారిపురం మార్గంలో మట్టి తవ్వకాలపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి తెలిపారు. తవ్వుకుంటాం..దండుకుంటాం!శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో స్పందించారు. ఈమేరకు మట్టి అక్రమ తవ్వకాలపై తహసీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, ఆర్ఐ కె.ఖగేశ్వరరావుతో కూడిన రెవెన్యూ అధికారుల బృందం గురువారం క్షేత్రస్థాయి పరిశీలించింది. కంబిరిగాం- కేదారిపురం రోడ్డులో వారంరోజులుగా మట్టిని తరలిస్తుండడంపై కథనంతో వెలుగులోకి రావడంతో ఎంత మేరకు మట్టిని తవ్వారో అంచనా వేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటికే సంబంధిత యంత్రాలపై కేసు నమోదు చేసి అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వెలిగిన దీపాలు

నందిగాం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నందిగాం జాతీయరహదారి అండర్‌పాసేజ్ వంతెన కింద ఎట్టకేలకు విద్యుత్ దీపాలు వెలిగాయి. అంతా రివర్స్ శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమయ్యింది. దీంతో సంబంధిత అధికారులు స్పందించి లైట్లకు గురువారం మరమ్మతులు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట ఈపీడీసీఎల్ పరిధిలోగల జమ్ము, కృష్ణానగర్, తామరాపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఏడునుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఆశీలు వేలంపాట

టెక్కలి,మార్చి 27(ఆంధ్రజ్యోతి):టెక్కలి పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సంత, కబేలా, రోజువారీ ఆశీలు, ట్యాక్సీస్టాండ్ కోసం ఆశీలు వేలంపాట నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి శశిధర్ తెలిపారు. ఆసక్తి గల వారు లక్ష రూపాయలు విలువచేసే సాల్వెన్సీతో పాటు లక్ష రూపాయలు నగదు డిపాజిట్ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు.

నేడు అవగాహన సదస్సు

టెక్కలి మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం లైంగిక నేరాలనుంచి పిల్లల రక్షణచట్టం అనే అంశంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు కర్లెమ్మ పంచాయతీలో..

కొత్తూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కర్మెమ్మ పంచాయతీ మార్కెట్ ఆశీల వేలం పాట శనివారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్‌నాయుడు తెలిపారు.పాటలో పాల్గొనదలిచిన వారు రూ.30వేలు డీడీతో గంటముందు పాటలో పాల్గొనాలనికోరారు.

రేపు మండల సమావేశం

టెక్కలి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): టెక్కలి మండల సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి తెలిపారు. ఎంపీపీ అట్ల సరోజినమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

పాతపట్నం మార్చి27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం బీసీ కార్పొరేషన్ రుణ లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.చంద్రకుమారి తెలిపారు. దరఖాస్తుదారులు రైస్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం ఆధార్‌కార్డు ఒరిజినల్‌తో హాజరుకావాలని కోరారు.

●హిరమండలం,మార్చి27(ఆంధ్రజ్యోతి):బీసీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కాళీ ప్రసాదరావు చెప్పారు.

●ఎల్.ఎన్.పేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం బీసీలకు సబ్సిడీపై మంజూరుచేసే రుణాలకు శనివారం మండలకార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన

పోలాకి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వనిత మండలం వంశధార నది వద్ద నిర్మిస్తున్న వంతెన నుంచి కుమ్మరివీధి, కాపుకాలనీ, ప్రాథమిక పాఠశాల వరకూ రూ.127లక్షలతో నిర్మించిన బీటీరోడ్డు పనులను గురువారం పంచాయతీరాజ్ ఈఈ ఎస్.రామకృష్ణ, డీఈఈ జి.సత్యంనాయుడు,ఏఈఈ వై.మోహన్ పరిశీలించారు. ఆయన వెంట మోహన్, అప్పారావు, గ్రామపెద్దలు ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఫయ్యాజ్‌అహ్మద్

పలాస, మార్చి27(ఆంధ్రజ్యోతి):స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఫయ్యాజ్‌అహ్మద్(షుని) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గురువారం స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఎన్నికలు మాజీ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, న్యాయవాది పైల రాజరత్నంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.అధ్యక్షుడిగా అహ్మద్,ఉపాధ్యక్షుడిగా బి.కామేశ్వరరావు పట్నాయక్, కార్యదర్శిగా కాళిదాస్, సంయుక్తకార్యదర్శిగా అనిల్‌రాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి: ఈఈ

హిరమండలం, మార్చి27(ఆంధ్రజ్యోతి):పేద ఎస్సీఎస్టీ కులాల అభ్యున్నతికి ప్రభుత్వం ఇచ్చే విద్యుత్ సబ్సిడీలో అదనంగా వినియోగించిన విద్యుత్‌కు బిల్లు బకాయిలు చెల్లించాలని టెక్కలి ఎలక్ట్రికల్ ఈఈ జి.శంకరరావు కోరారు.గురువారం హిరమండలం, భగీరథపురంలో విద్యుత్ బకాయిల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పోగా వచ్చే కనీస విద్యుత్ చార్జీ గత కొన్నేళ్లుగా కట్టని వారికి, అనర్హులకు, 200 యూనిట్లు దాటిని వారు బకాయిలు చెల్లించాలని కోరారు. ఈమేరకు అధిక బకాయిలున్న కొంతమంది వినియోగదారుల కనెక్షన్‌ను తొలగించారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి

టెక్కలి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తొలుసూరుపల్లి పంచాయతీ లోగల ధర్మనీలాపురం రెవెన్యూపరిధి మున్సబుపేటలో సర్వేనెంబరు 105-3 పోరం పోగు స్థలంలో దళితులకు శాశ్వత ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కేవీపీఎస్ నాయకులు బెలమరప్రభాకరరావు కోరారు. సర్వేనెంబరు 151లో లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సంబంధించిన స్థలంలో కొందరు ఇళ్లను నిర్మించుకుని దశాబ్దకాలంగా ఉంటున్నారని తెలిపారు.ఈమేరకు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి కేవీపీఎస్ నాయకులు ప్రభాకరరావు,మోహిని, రమ్యకృష్ణ గురువారం వినతిపత్రం అందజేశారు.

రూ.20 కోట్లు మంజూరు

కొత్తూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలంలో రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి రూ. 20 కోట్లు మంజూరయ్యాయని మండల ఉపాధ్యక్షుడు ఎల్.తులసీవరప్రసాదరావు తెలిపారు. గురువారం కొత్తూరులో విలేకరులతో మాట్లాడుతూ కడుము, ఆకులతంపర, హంస, నేరడి, సిరుసువాడ, సోమరాజపురం, కర్లెమ్మతో పాటు పలు గిరిజన గ్రామాల్లో రహదారులు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఎల్ లక్ష్మీనారాయణనాయుడు, కొయిలాపు సంజీవరావు, రేగేటి కన్నయ్య పాల్గొన్నారు.